

కోటి కుటుంబాల్లో సూర్యోదయం!



ప్రధానమంత్రి సూర్యోదయ యోజన... కోటి కుటుంబాల్లో వెలుగులు నింపనుందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ఈ పథకంలో భాగంగా కోటి ఇళ్ల పైకప్పులపై సౌర విద్యుత్ ప్యానెళ్లను ఏర్పాటు చేస్తారు. ఫలితంగా ఒక్కో కుటుంబం నెలకు 300 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా పొందేందుకు, ఏడాదికి రూ.15,000 నుంచి రూ.18,000 దాకా ఆదా చేసుకునేందుకు, మిగులు విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించేందుకు వీలు కలుగుతుంది. తాత్కాలిక బడ్జెట్‌లో సౌర విద్యుత్ రంగానికి రూ.7,327 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో కేటాయించిన రూ.4,979 కోట్ల కంటే దాదాపు 48 శాతం ఎక్కువ. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా 'రూఫ్ టాప్ సోలార్' పథకం వల్ల కలిగే ప్రయోజనాల్ని కేంద్ర మంత్రి సభకు వివరించారు. ఈ పథకం విద్యుత్ వాహనాల ఛార్జింగ్‌కూ ఉపకరిస్తుందని, ఉపకరణాల తయారీ, నైపుణ్యాల పరంగా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అయోధ్యలో రాముడి ప్రాణ ప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ 'ప్రధానమంత్రి సూర్యోదయ యోజన' పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. 'రూఫ్ టాప్ సోలార్' పథకానికి రూ.10,000 కోట్లు కేటాయించనున్నట్లు ఆర్థికశాఖ కార్యదర్శి టి.వి.సోమనాథన్ చెప్పారు.



'వికసిత భారత్' సాకారమయ్యేలా..

రాష్ట్రాలకు రూ.75 వేల కోట్ల వడ్డీలేని రుణాలు



దిల్లీ: 2047 నాటికి 'వికసిత భారత్' సాకారానికి రాష్ట్రాలు చేపట్టే సంస్కరణలకు తోడ్పాటు అందించేందుకు ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.75 వేల కోట్ల వడ్డీలేని రుణాలను.. 50 ఏళ్ల కాలపరిమితితో అందించనుంది. కాగా, 2024-25 బడ్జెట్ అంచనాల ప్రకారం రాష్ట్రాలకు రూ.22,22,264 కోట్ల నిధులు బదిలీ చేయనున్నారు. ఇందులో రాష్ట్రాల నుంచి వచ్చిన నిధుల్లో వాటాతో పాటు గ్రాంట్లు/రుణాలు, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద ఇచ్చే నిధులు ఉంటాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వాస్తవ కేటాయింపులతో పోల్చితే ఇది రూ.4,13,848 కోట్లు అధికం. దేశ సర్వతోముఖ, సమ్మిళిత అభివృద్ధి సాధించే లక్ష్యంతో మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

కొత్త కారిడార్లు.. సరికొత్త బోగీలు


- రవాణాను వేగవంతం చేయనున్న నడవాలు
- వందేభారత్ స్థాయికి 40 వేల సాధారణ కోచ్‌లు

దిల్లీ: దేశంలో రైలు మార్గం ద్వారా జరిగే సరకు రవాణాను వేగవంతం చేయడంతోపాటు ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు కల్పించబోతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మూడు ప్రధాన రంగాలకు భారీ ఆర్థిక నడవాలు (ఎకనమిక్ కారిడార్లు) తీసుకువస్తామని, దాదాపు 40 వేల సంప్రదాయ రైలుపెట్టెల్ని అధునాతన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ తరహా కోచ్‌లుగా మారుస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. పెరిగిన ట్రాఫిక్‌తో రైలుమార్గాల్లో నెలకొన్న రద్దీని తగ్గించి, ప్రయాణికుల రైళ్ల నిర్వహణను మెరుగుపరచడానికి ఈ ప్రతిపాదన దోహదపడుతుందని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి భారతీయ రైల్వే ఒక చోదక శక్తిగా నిలుస్తుందన్నారు. "మూడు నడవాల్లో మొదటిది 'ఇంధన, ఖనిజాలు, సిమెంట్ నడవా'. రెండోది ఓడరేవుల అనుసంధాన నడవా, మూడోది అధిక ట్రాఫిక్ రద్దీ నడవా. 'ప్రధాని గతిశక్తి పథకం' కింద ప్రాజెక్టులను గుర్తించి బహుళ రవాణా అనుసంధానతకు మార్గం సుగమం చేస్తాం. ఇవి రవాణారంగ సమర్థతను పెంచి, వ్యయాన్ని తగ్గిస్తాయి. సరకు రవాణాకు కేటాయించిన ప్రత్యేక మార్గాలు (డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్లు)తో కలిసి ఈ మూడు కార్యక్రమాలు మన స్థూల జాతీయోత్పత్తిని పెంచుతాయి" అని చెప్పారు. భద్రత, సౌకర్యాలను మెరుగుపరచడానికి రైలుపెట్టెల ప్రమాణాలను పెంచుతామన్నారు.

పట్టణ ప్రాంతాల రూపాంతరీకరణ

దేశంలో పట్టణీకరణ, పట్టణ ప్రాంతాల రూపాంతరీకరణ శరవేగంగా సాగుతున్నాయని నిర్మల చెప్పారు. మెట్రోరైళ్లు, నమోభారత్ రైళ్లు దీనికి ఉత్ప్రేరకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. వీటిని మరింతగా విస్తరించుకుంటూ వెళ్లడం ద్వారా పెద్ద నగరాల్లో రవాణాపరమైన అభివృద్ధికి ఊతం లభిస్తుందని చెప్పారు. దేశంలో మధ్యతరగతి ప్రజలు వేగంగా విస్తరిస్తున్నారని తెలిపారు.





అయిదేళ్లు... రెండు కోట్ల ఇళ్లు!



దిల్లీ: ఎన్నికల వేళ మధ్య తరగతిని ఆకర్షించేందుకు కేంద్రం గృహ నిర్మాణ పథకాన్ని ప్రకటించింది. రానున్న ఐదేళ్లలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన(గ్రామీణ) కింద మరో రెండు కోట్ల ఇళ్లను అదనంగా నిర్మించనున్నట్లు తెలిపింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.80,671 కోట్లను కేటాయించారు. 2023-24లో కేటాయించిన రూ.79,590 కోట్లతో పోలిస్తే ఇది ఎక్కువ. అద్దె ఇళ్లు, మురికివాడలు, అనధికార కాలనీల్లో నివసించే మధ్య తరగతి వారి కోసం గృహాల్ని నిర్మించేందుకు, కొనుగోలు చేసేందుకు ఈ పథకం ఉపకరిస్తుందని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్దేశించుకున్న మూడు కోట్ల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని త్వరలోనే చేరుకోనున్నట్లు వెల్లడించింది. పెరుగుతున్న కుటుంబాల అవసరాల్ని తీర్చేందుకు రాబోయే ఐదేళ్లలో అదనంగా మరో రెండు కోట్ల ఇళ్లను అందుబాటులో తెస్తామంది. ఈ పథకంలో భాగంగా మైదాన ప్రాంత లబ్ధిదారులకు రూ.1.20 లక్షలు, కొండ ప్రాంతాల్లోని వారికి రూ.1.30 లక్షల చొప్పున సాయంగా అందిస్తారు. ఈ వ్యయాన్ని 60:40 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి.

ఈసారి డిజిటల్ పద్దే

బహీ ఖాతాలో ట్యాబ్‌ను తీసుకెళ్లిన నిర్మల



దిల్లీ: మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గతేడాదిలాగే ఈసారి కూడా కాగితరహిత బడ్జెట్ విధానాన్ని ఉపయోగించారు. ఇందుకోసం సంప్రదాయ 'బహీ ఖాతా'(వస్త్రం లాంటి సంచి)లో ట్యాబ్‌ను తీసుకెళ్లారు. రాష్ట్రపతిని కలిసే ముందు అధికారులతో కలిసి ఆమె తన కార్యాలయం ఎదుట ఫోటోలు దిగారు. డిజిటల్ విధానంలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు బ్రీఫ్‌కేస్‌కు బదులుగా ట్యాబ్‌ను తీసుకెళ్లారు. ఎర్రటి వస్త్రం మీద బంగారు వర్ణంలో జాతీయచిహ్నం ముద్రించి ఉన్న సంచితో రాష్ట్రపతిభవన్‌కు వెళ్లిన ఆర్థికమంత్రి.. రాష్ట్రపతిని కలిసి అక్కడి నుంచి నేరుగా పార్లమెంటుకు వెళ్లారు.

కొత్త సంప్రదాయానికి నాంది

2019లో ఆర్థికశాఖ బాధ్యతలు స్వీకరించిన నిర్మల. .దేశంలో పూర్తిస్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన మహిళా ఆర్థికమంత్రిగా రికార్డు నెలకొల్పారు. బ్రిటిష్ కాలంలో ఉపయోగించిన 'బ్రీఫ్‌కేస్' విధానం స్థానంలో 'ట్యాబ్‌లెట్' పద్ధతి తెచ్చి కొత్త సంప్రదాయానికి నాందిపలికారు. భాజపా ప్రభుత్వం 2019లో రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థికమంత్రిగా నిర్మలను నియమించారు. అదే ఏడాది జులై 5న ఆమె తొలిసారిగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విదేశీ పాలన నుంచి స్వాతంత్ర్యం పొంది ఏళ్లు గడుస్తున్నా. . ఇప్పటికీ వారి విధానాలను అనుసరించడమేంటని ప్రశ్నించారు. బ్రిటిష్ సంప్రదాయానికి 'బహీ ఖాతా' విధానంతో స్వస్తి పలికామన్నారు.

అంతరిక్ష రంగానికి రూ.2వేల కోట్ల పెంపు



దిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో అంతరిక్ష రంగానికి రూ.13,042.75 కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2023-24కు సంబంధించి సవరించిన అంచనాల ప్రకారం ఈ రంగానికి కేటాయింపులు రూ.11,070.07 కోట్లు. ఈ లెక్కన తాజా బడ్జెట్‌లో దాదాపు రూ.2వేల కోట్లు పెరుగుదల నమోదైనట్లే. అంతరిక్ష పరిజ్ఞాన రంగానికి ఈసారి రూ.10,087 కోట్లు ప్రతిపాదించారు. 2023-24లో ఈ పద్దు కింద రూ.8,180 కోట్లు కేటాయించారు. 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రాన్ని నిర్మించాలని, 2040 నాటికి భారత వ్యోమగామిని చంద్రుడిపైకి పంపాలని లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో ఈ కేటాయింపులు జరిగాయి.

● అణుశక్తి శాఖకు రూ.36,159.93 కోట్లను తాజా బడ్జెట్‌లో కేటాయించారు. 2023-24 కేటాయింపుల (రూ.36,905.45 కోట్లు)తో పోలిస్తే ఇప్పుడు ఈ పద్దు కింద కోత పడింది.

58 నిమిషాల్లో ముగిసిన బడ్జెట్ ప్రసంగం

- నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగం 58 నిమిషాల పాటు సాగింది. ఆమె చేసిన ఆరు బడ్జెట్ ప్రసంగాల్లో ఇదే చిన్నది. అత్యధిక సమయం పాటు బడ్జెట్ ప్రసంగం చేసిన ఆర్థికమంత్రిగా ఆమె ఇది వరకే రికార్డు సృష్టించారు. 2020లో రెండు గంటల 40 నిమిషాల పాటు ఆమె మాట్లాడారు.
- జులైలో తమ ప్రభుత్వమే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతుందని నిర్మల అన్నప్పుడు అధికార పార్టీ సభ్యులు ఏకకంఠంతో మద్దతు తెలిపారు. విపక్ష సభ్యులు దీనిని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు.
- లోక్‌సభకు ప్రధాని మోదీ వచ్చే సమయంలో భారత్ మాతా కీ జై, జై శ్రీరామ్, జై సియా రామ్ నినాదాలతో సభ మార్మోగింది.
- గతంలో తమిళ కవుల పద్యాలను ఎక్కువగా ఉటంకించే నిర్మల.. ఈ ప్రసంగంలో వాటిని ప్రస్తావించలేదు. ప్రధాని మోదీ పేరును కనీసం ఎనిమిది సార్లు వివిధ సందర్భాల్లో ఉచ్చరించారు.
- లోక్‌సభ పబ్లిక్ గ్యాలరీల్లో సందర్శకులు పెద్దగా కనబడలేదు. కొందరు రాజ్యసభ సభ్యులు, నిర్మలా సీతారామన్ కుమార్తె వాంగ్మయీ పరకాల, మరికొందరు బంధువులు హాజరయ్యారు.
- ఎఫ్‌డీఐకి ఫస్ట్ డెవలప్ ఇండియా అని, జీడీపీకి గవర్నెన్స్, డెవలప్‌మెంట్, పర్ఫార్మెన్స్ అని ఆర్థికమంత్రి కొత్త అర్థాన్నిచ్చారు.
- బడ్జెట్ ప్రసంగం పూర్తయిన అనంతరం నిర్మలా సీతారామన్ వద్దకు ప్రధాని మోదీ వెళ్లి అభినందించారు.

వాణిజ్యంపై యుద్ధాల ప్రభావం: నిర్మల

దిల్లీ: యుద్ధాలు, సంఘర్షణల నడుమ అంతర్జాతీయ వ్యవహారాలు మరింత సంక్లిష్టంగా, సవాలుగా మారాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ సంక్షోభాల వల్ల అంతర్జాతీయ సరఫరా గొలుసు వ్యవస్థలు దెబ్బతిన్నాయని తద్వారా వాణిజ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందని తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. చమురు, ఎరువుల ధరలపై ప్రపంచ వ్యాప్తంగా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ భారత్ విజయవంతంగా ముందుకు వెళుతోందని ఆమె అన్నారు.

పాఠశాల విద్యకు రూ.73 వేల కోట్లు



దిల్లీ: గతంలో ఎన్నడూ లేని స్థాయిలో పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగానికి కేంద్రప్రభుత్వం రూ.73,498 కోట్లు కేటాయించింది. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన పీఎం శ్రీ పథకానికి బడ్జెట్‌లో రూ.6,050 కోట్లు కేటాయించారు. సమగ్ర శిక్షా అభియాన్, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలకు సైతం ఈ బడ్జెట్‌లో ఎక్కువ నిధులను ఇవ్వనున్నారు. పాఠశాల విద్యకు కేంద్రం వాటాగా రాష్ట్రాలకు వెళ్లాల్సిన నిధులనూ పెంచారు. రాష్ట్రాలకు రూ.8,200 కోట్లు, కేంద్రపాలిత ప్రాంతాలకు రూ.308 కోట్ల చొప్పున కేటాయింపులు పెరిగాయి.

2014 తర్వాతే పెద్ద సంఖ్యలో ఐఐటీలు, ఐఐఎంలు

ఐఐటీలు, ఐఐఎంలు వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను 2014 తర్వాత పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేశామని కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఈ దశాబ్ద కాలంలో 7 ఐఐటీలు, 16 ఐఐఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్, 390 విశ్వవిద్యాలయాలను నెలకొల్పామని పేర్కొన్నారు.

ముఖ్య రంగాలకు రూ.1.21 లక్షల కోట్ల కోత



ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2023-24లో ముఖ్య రంగాలకు కేటాయించిన బడ్జెట్‌ను పూర్తి స్థాయిలో ఖర్చు చేయలేదు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు, వాణిజ్యం, విద్య, విద్యుత్తు, వైద్యం, హోం, సామాజిక సంక్షేమం, రాష్ట్రాలకు బదిలీ చేయాల్సిన నిధుల్లో రూ.1,21,433 కోట్లు కోతపెట్టింది. బడ్జెట్ సవరించిన అంచనాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.

వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో పూర్తిగా ఖర్చుకాని నిధులు (రూ. కోట్లలో)

రంగం (అనుబంధంతో కలిపి)	2023-24 బడ్జెట్ అంచనాలు	సవరించిన అంచనాలు	వ్యత్యాసం
వ్యవసాయం	1,44,214	1,40,533	−3,681
విద్య	1,16,417	1,08,878	−7,539
ఇంధనం	94,915	54,989	−39,926
వైద్యం	88,956	79,221	−9,735
హోం	1,34,917	1,33,360	−1,557
సామాజిక సంక్షేమం	55,080	46,741	−8,339
రాష్ట్రాలకు బదిలీ	3,24,641	2,73,985	−50,656
మొత్తం	9,59,140	8,37,707	-1,21,433

పొరుగుకూ సాయం!

దిల్లీ: విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు రూ.22,154 కోట్లను కేటాయించారు. గత బడ్జెట్(రూ.18,050 కోట్లు)తో పోలిస్తే ఈ నిధులు ఎక్కువ. పొరుగు దేశాలతో బంధాన్ని బలోపేతం చేసేందుకు నిర్మలా సీతారామన్ ప్రాధాన్యం ఇచ్చారు. మన దేశం అవలంబిస్తున్న 'పొరుగుకే తొలి ప్రాధాన్యం' విధానంలో భాగంగా సరిహద్దు దేశమైన భూటాన్ అభివృద్ధికి రూ.2,068 కోట్లను కేటాయించారు. మాల్దీవులకు అభివృద్ధి సాయంగా రూ.600 కోట్లను ప్రకటించారు. నేపాల్‌కు రూ.700 కోట్లు, అఫ్గానిస్థాన్‌కు రూ.200 కోట్లు, బంగ్లాదేశ్‌కు రూ.120 కోట్లను అభివృద్ధి సాయంగా కేటాయించారు. ఇరాన్‌తో అనుసంధాన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టిన కేంద్రం ఆ దేశంలోని చాబహార్ పోర్టు నిర్వహణకు రూ.100 కోట్లను ప్రకటించింది.



మరిన్ని వైద్య కళాశాలలు.. అంగన్‌వాడీలకు ఆరోగ్య రక్ష

ప్రస్తుతం దేశంలో గల ఆసుపత్రుల మౌలిక సదుపాయాలను ఉపయోగించుకుని మరిన్ని వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఈ అంశాన్ని పరిశీలించి, సిఫారసులు చేసేందుకు ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనుంది. ఈ విషయాన్ని ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు.



● తొమ్మిది నుంచి 14 సంవత్సరాల మధ్య గల బాలికలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నిరోధక టీకాలు ఇచ్చే కార్యక్రమాన్ని కేంద్రం ప్రోత్సహించనుంది. తాజా గణాంకాల ప్రకారం ఏటా దేశంలో 80 వేల మంది గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ బారిన పడుతున్నారు. 35 వేల మంది ఈ వ్యాధి కారణంగా మరణిస్తున్నారు.

● మాతా శిశు సంరక్షణకు సంబంధించిన అన్ని రకాల పథకాలను ఓ సమీకృత కార్యక్రమం కిందకు తీసుకురానున్నారు.



● బాలల సంరక్షణ, అభివృద్ధికి మెరుగైన పోషకాహార పంపిణీ కోసం సక్షామ్ అంగన్‌వాడీ-పోషణ్ 2.0 కింద అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునికీకరించనున్నారు.



● దేశంలోని ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులందరికీ ఆయుష్మాన్ భారత్ పథకం కింద ఆరోగ్య బీమా కల్పించనున్నట్లు కేంద్రం పేర్కొంది. ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన కింద లబ్ధిదారు కుటుంబానికి రూ.5 లక్షల ఆరోగ్య బీమాను కల్పిస్తున్నారు. గతేడాది డిసెంబరు 27 నాటి 12 కోట్ల కుటుంబాలకు చెందిన 55 కోట్ల మంది ఈ పథకం పరిధిలోకి వచ్చారు.



● దేశవ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని నిర్వహించేందుకు, పిల్లల్లో రోగ నిరోధకత పెంచడం కోసం తీసుకొచ్చిన 'మిషన్ ఇంద్రధనుస్సు' పథకం సమర్థ అమలుకు యూ-విన్ వేదికను వేగవంతంగా విస్తరిస్తారు. ప్రస్తుతం ఒక్కో రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల్లోని రెండేసి జిల్లాల్లో యూ-విన్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. దీని కింద దేశ టీకా కార్యక్రమాన్ని డిజిటలీకరిస్తారు.

- దిల్లీ

మీ నోరు తియ్యగా..

దిల్లీ: 2024-25 ఆర్థిక సంవత్సర మధ్యంతర (ఓట్ ఆన్ అకౌంట్) బడ్జెట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ గురువారం ఆమోదం తెలిపింది. సంప్రదాయాన్ని అనుసరించి.. బడ్జెట్ సమర్పణకు ముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్థికశాఖ సహాయ మంత్రులు భగవత్ కిషన్‌రావ్ కరాడ్, శ్రీపంకజ్ చౌధరి, ఆ శాఖ సీనియర్ అధికారులు.. రాష్ట్రపతిని కలిసినవారిలో ఉన్నారు. శుభసూచకంగా భావించే పెరుగు, పంచదార మిశ్రమాన్ని సీతారామన్‌కు రాష్ట్రపతి అందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ఆర్థిక మంత్రి పార్లమెంటుకు వెళ్లారు.

● అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద 1.89 కోట్ల కుటుంబాలకు రాయితీ ధరపై నెలకు కిలో చొప్పున చక్కెర సరఫరా చేయడాన్ని మరో రెండేళ్లపాటు (2026 మార్చి 31 వరకు) పొడిగించడానికి కేబినెట్ సమ్మతించింది. భారత్-యూఏఈ మధ్య ద్వైపాక్షిక పెట్టుబడుల ఒప్పందంపై సంతకం చేయడానికి ఆమోదం తెలిపింది.



మధ్యంతర బడ్జెట్ సమర్పణ సందర్భంగా గురువారం రాష్ట్రపతిభవన్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పంచదార కలిపిన పెరుగును తినిపిస్తున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

నిర్మలమ్మ రికార్డు బడ్జెట్ ఇది!

దిల్లీ: కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ఆరో సారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. మాజీ మంత్రి మొరార్జీ దేశాయ్ తర్వాత వరుసగా ఆరు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. అయిదు సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన తన సీనియర్‌లు మన్మోహన్‌సింగ్, అరుణ్ జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్ సిన్హాలను ఆమె అధిగమించారు. దేశానికి తొలి పూర్తి స్థాయి మహిళా ఆర్థికమంత్రిగా ఇప్పటికే రికార్డు సృష్టించిన నిర్మల.. 2019లో తొలి సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. 2019 ఎన్నికల తర్వాత వచ్చిన 'మోదీ 2.0' ప్రభుత్వంలో కేంద్ర ఆర్థికశాఖ పగ్గాలు నిర్మలా సీతారామన్ చేపట్టారు. ఇందిరాగాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళగా నిర్మలమ్మ రికార్డు సృష్టించారు. ఇందిరాగాంధీ 1970-71లో పద్దు సమర్పించారు. ఓట్ ఆన్ ఎకౌంట్ బడ్జెట్‌గా పిలిచే ప్రస్తుత పద్దులో రానున్న ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల వ్యయాలను పేర్కొని, పార్లమెంటు ఆమోదం పొందారు. ఏప్రిల్ లేదా మే తర్వాత కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం పూర్తిస్థాయి పద్దును ప్రవేశపెడుతుంది.

గిరిజనానికి 70% నిధుల పెంపు



దిల్లీ: గిరిజనుల సర్వతోముఖాభివృద్ధిని కాంక్షిస్తూ... కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖకు తాత్కాలిక బడ్జెట్‌లో రూ.13,000 కోట్లను నిర్మలా సీతారామన్ ప్రకటించారు. గత బడ్జెట్‌లో ఇచ్చిన రూ.7,605 కోట్లతో పోలిస్తే 70 శాతం ఎక్కువ. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణానికి రూ.6,399 కోట్లను వెచ్చించనున్నారు. ప్రధానమంత్రి ఆది ఆదర్శ్ గ్రామ యోజనకు రూ.1,000 కోట్లను ప్రకటించారు.